# ఒక మాట

1999వ సంవత్సరం, డిసెంబరు 31వ తేదీ, రాత్రి 11 గం.లు. ప్రపంచం మొత్తం నూతన సహస్రాబ్దిని స్వాగతించడానికి సమాయత్తమవుతున్నది. డి.పి మేనర్ లో మందు పార్టీలు, పబ్బుల్లో ప్రైవేటు సరదాలు అన్నీ సక్రమంగా సాగుతున్నాయి. వీటన్నింటికీ దూరంగా, ప్రపంచంతో సంబంధం లేకుండా ఒక గదిలో 40 వాట్ల బల్బు వెలుగులో కూర్చొని నిరాశగా జీవితం గురించి ఆలోచించసాగింది ఒక అమ్మాయి.

"ప్రపంచం ఎంతో వేగంగా ముందుకు దూసుకుపోతోంది. శాస్త్ర, సాంకేతిక రంగాలలో అనేక అద్భుత ఆవిష్కరణలు జరిగాయి. మానవుడి మేథస్సుకు సృష్టిలోని అణువణువూ తలవంచింది. చంద్రునిపై కాలుమోపగలిగిన మానవుడు మరింత ముందుకు ఆలోచించి అంగారక గ్రహంపై జీవనం కోసం ఆలోచించసాగాడు. రానున్న సహస్రాబ్దిలో మరిన్ని మహాద్భుతాల సృష్టి జరగనుంది. కానీ నేను ఏమీ చేతగానిదానిలా, ఒక అనామకురాలిలా జరుగుతోన్న అద్భుతాలని చూస్తూ నిర్లిప్తంగా ఉండిపోవల్సినదేనా?"

ఇలా ఆమె ఆలోచనల ప్రవాహం కొనసాగింది. ఇంతలో ఎదురుగా మహాకవి శ్రీశ్రీ గారి 'మహాప్రస్థానం' కనపడింది. ఉపశమనం కోసం వెంటనే దానిని తీసి చదవనారంభించింది. అందులో ఓ గేయం ఆమె దృష్టిని ఎంతగానో ఆకర్షించింది.

"కారడవులలో లయాతీతమై, విరుతించిన నానా జంతు ధ్వనులో,
నక్షత్రాంతర్నిబిడ నిఖిలగానం, భూకంపాలు, ప్రభుత్వ పతనాలు,
విప్లవం, యుద్ధం, అన్నీ నీ చైతన్యం! నీ విశ్వరూప సాక్షాత్కారం!" *1*

"'విశ్వరూప సాక్షాత్కారం', అవును! ప్రపంచం ఎదుట నా విశ్వరూపం సాక్షాత్కారం కావాలి. నేను అగ్ని పరస్సున వికసించిన వజ్రమని అందరూ తెలుసుకోవాలి. మానవుడి ఊహకి కూడా అందని అనేక అనన్య సామాన్య, అత్యద్భుత అంశాల అంకురార్పణ నా చేతుల మీదుగా జరగాలి. మహామహులయిన శాస్త్రవేత్తల మేథస్సుకే పెనుసవాలుగా పరిణమించిన జన్యు విశ్లేషణ, కృత్రిమ కణ రూపకల్పన నేను చేయగలగాలి. సృష్టికి ప్రతిసృష్టి చేయాలి. అవును! సృష్టికి ప్రతిసృష్టి చేయాలి."

ఇలా ఆమె మస్తిష్కంలో చిన్న సెలయేరుగా పుట్టిన ఆలోచనల ప్రవాహం శంఖారావం, ఢంకాధ్వానం చేస్తూ, ఉప్పెనయై, మహాసముద్రమై ముందుకు సాగుతూ, కొండలని పిండి చేయగల మహోన్నతమైన ఆత్మవిశ్వాసమనే శక్తిగా రూపుదాల్చి, స్వస్తివాక్యములు సంధానిస్తూ, స్వర్ణ వాద్యములు సమ్రావిస్తూ, ఖడ్గమృగోదగ్ర విరావంతో, మనిషి పతనానికి ముఖ్యకారణమైన హృదయ దౌర్బల్యాన్ని తరిమి కొట్టింది. ఇప్పుడామె మనస్సు ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. అంబరాన్నంటుతున్న ఆత్మవిశ్వాసపు ఆసరాతో నవసహస్రాబ్దికి హృదయపూర్వక స్వాగతం పలికి, శ్రమ యజ్ఞాశ్వములపై, గిరులు, సాగరులు, కంకేళికా మంజరులు వెంటరాగా సుశిక్షితుడైన ఒక సైనికుడిలా తన శక్తి సామర్థ్యాలను నిరూపించుకునేందుకు మే 5 వ తేదీ కోసం ఎదురు చూడసాగింది.

ఇటువంటి ఎందరో అమ్మాయిలు, ఎందరో అబ్బాయిలు రాష్ట్రవ్యాప్తంగా రెసిడెన్షియల్ కళాశాలలలోనూ, తల్లిదండ్రుల పర్యవేక్షణలోనూ రక్తాన్ని ధారపోసి, చదువేలోకంగా, శ్రమయే విజయానికి సాధనంగా భావిస్తూ, నరాల బిగువూ, కరాల సత్తువ వరాల వర్షం కురిపిస్తుందని, త్రిలోకాలలో, త్రికాలాలలో శ్రమైక జీవితానికి మించిన సౌందర్యం వేరొకటి లేదని, కర్మ వీరులకు, కష్టజీవులకు నిత్యమంగళం సిద్ధిస్తుందనే నమ్మకంతో ముందుకు సాగుతున్నారు.

వారిలో మీరూ ఉన్నారు. సంవత్సర కాలంపాటు ప్రపంచంతో సంబంధం లేకుండా, నరాలన్నీ బిగబట్టి, జవసత్వాలని కూడగట్టి త్రికరణ శుద్ధిగా మీరు పడ్డ కష్టం, మీ పరిశ్రమ నిస్సందేహంగా హర్షించదగ్గవే. మీ కష్టానికి తగ్గ ప్రతిఫలం రావాలన్నా, నెలల తరబడి మీ గురించే ఆలోచిస్తూ, సదా మీ ఉన్నతినే ఆకాంక్షిస్తూ నిద్రలేకుండా కష్టపడుతోన్న మీ తల్లిదండ్రుల కలలు ఫలించాలన్నా, అత్యంత క్లిష్టమయిన, అత్యంత ముఖ్యమయిన ఈ సమయంలో అనేక విజయాలకు ఆధారమయిన ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా మనస్సుని నిశ్చలంగా ఉంచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఆ ఆత్మ విశ్వాసాన్ని మీలో ప్రేరేపించడానికి మేము చేస్తున్న ప్రయత్నమే ఈ సందేశం. మా ఈ ప్రయత్నంలో కృతార్థులని చెయ్యగల శక్తి మీకే ఉంది. అందుకే మాకోసం, మీ కోసం ఒక్కసారి సాంతం పరికించండి...

"సారమిది నిఖిల జగత్తుకు, జరుగుచుండునుండు
చర్యలేకమొత్తమున, భారమోపి ఒక్క నియమమునందు
చరమైన పాలపుంతలు, చిరమైన కాలవిలయము
సరియైనదే జరుగుచుండు, అమర మీ జగతి సారమిది నిఖిల జగత్తుకు!" 2

భావాన్వితవిశ్వావగాహన పైన వ్రాయబడిన వివరణ మీద ఆధారపడే ఆరంభమవుతుంది. 'సత్యమైన శ్రమయే జయించును' అనే చిన్న నియమమే ఈ విశ్వవిన్యాసానికి మూలాధారం. పై కవిత సారాంశం అదే.

మానవ పరిజ్ఞానము యొక్క పరిధి సూక్ష్మాతి సూక్ష్మం నుండి స్థూలాతి స్థూలం వరకు విస్తరించి ఉంది. సమస్త మానవాళి మనుగడకు ప్రామాణికమయిన శ్రీమద్భగవద్గీతలో శ్రీకృష్ణభగవానుడు వివరించినది కూడా అదే.

"అర్జునా! సూక్ష్మమైన పరమాణువు నుండి స్థూలమైన విశ్వం వరకూ నేనే నిండి ఉన్నాను" అని! నిజానికి పరమాణువు కూడా విశ్వంలో ఒక భాగమే. కానీ పైదాని భావము భగవానుడు సూక్ష్మం నుండి స్థూలం వరకు అంత పరిమాణంలోను దర్శనమివ్వగలడు అని. దీనివలన మనకు అర్థమగునది 'భగవంతుడే జ్ఞానము, జ్ఞానమే భగవంతుడు' అని.

మానవుని జ్ఞాన తృష్ణకు అసలు కారణం 'అవసరం'. రాతి యుగంలో మానవుడు తన జీవనశైలిని సులువు చేసుకోవడానికి ప్రకృతి నియమాలను అధ్యయనం చేయడం ప్రారంభించాడు. క్రమేణా అతడికి ప్రకృతిలోని కొన్ని నియమాలు అర్థమవనారంభించాయి. విషయ విశ్లేషణ గావించి, విషయ పరిజ్ఞానం పరిధిని లెక్క కట్టడం నేర్చుకున్నాడు. కాలగమనంలో అతని పిపాసకు జ్ఞానసాగరములోని కొంత భాగం జఠరంలో జీర్ణమై, రక్తములో కలిసి, ధమనులలో ప్రవహించి, మెదడుకు చేరి అక్కడ నిక్షిప్తమవసాగింది. నిక్షిప్తమయిన ఈ జ్ఞాన నిధి దినదిన ప్రవర్ధమానమవుతూ, ఇంతకింతై నేటి

స్థితి కొచ్చింది. ఈ జ్ఞాన నిధి పుస్తకాలనే గుట్టలకింద భద్రంగా దాచిపెట్టబడి ఉంది. ఆ గుట్టలని త్రవ్వితేనే జ్ఞానం సిద్ధిస్తుంది.

అందుకనే

"బ్రహ్మాండాన్ని బ్రద్దలు కొడదాం, వెళదాం జ్ఞాననిధి పరిధులకు,
కొలుద్దాం జ్ఞాన భారం సత్తువున్నంత వరకు!" *3*

జ్ఞానాన్ని కొలవమని కపి అన్నడు. కానీ నిజంగా జ్ఞానాన్ని కొలవగలమా? దాని పరిధిని నిర్దేశించగలమా? అందుకే కపి "సత్తువున్నంతవరకు" అనే పదాన్ని ఉపయోగించాడు.

తన జీవిత కాలంలో మనిషి ఎంతో కొంత జ్ఞాన సముపార్జన చేస్తాడు. ఆ జ్ఞాన నిధికి అతను చెల్లించవల్సిన మూల్యం తిరిగి అతని సామర్ధ్యనుసారం జ్ఞాన నిక్షిప్తం చెయ్యడమే.

మనిషి సముపార్జించిన ఆ జ్ఞానమే సంఘంలో అతనికి ఒక స్థాయిని, హోదాని ఇస్తుంది. కొందరు మహామేధావులయిన శాస్త్రవేత్తలుగాను, తత్త్వవేత్తలుగాను రూపుదిద్దుకోవడానికి, మరికొందరు సాధారణ వ్యక్తులవలే మిగిలిపోవడానికి కారణం జ్ఞాన సముపార్జనలోని ఆ తేడాలే! ఆ తేడాలే సంఘాన్ని వివిధ తరగతులుగా విభజించినది.

ఇప్పుడు చెప్పండి మీకు ఏ శ్రేణి కావాలో, ఇప్పుడే ఆలోచించుకోండి మీరు ఏ తరగతికి చెందుతారో.

"If anything great has ever happened to humanity it has begun as a single thought in someone's mind. If anyone of us is capable of such a great thought then all of us have the same capacity and capability. That means we are all the same." *4*

పైన పేర్కొన్న ప్రకారం మానవుని ఆలోచనే మానవ మనుగడకు మూలాధారం. అటువంటి గొప్ప ఆలోచనలు చేయగల మనమంతా ఒకే సామర్థ్యం గలవాళ్ళం. ఒకవేళ ఇది నిజమే అయితే ప్రతీ మనిషి పేరూ చరిత్ర పుస్తకంలో వ్రాయబడి ఉండాలే! కానీ అలా జరగట్లేదు. ఎందుకని? దీనికి కారణం గీతలో ఇలా చెప్పబడింది.

అసంశయాత్మనా యోగో దుష్ప్రాప ఇతి మే మతిః | వశ్యాత్మనా తు యతతా శక్యోవాప్తు ముపాయతః|| *5*

"ఎవడి మనస్సుకయితే కళ్ళెం ఉండదో వాడికి ఆత్మజ్ఞానం సిద్ధించదు. ఎవడి మనస్సయితే వాడి అదుపాజ్ఞలలో ఉంటుందో, ఎవడైతే సరియైన రీతిలో శ్రమిస్తాడో వాడే విజయానికి అర్హుడు!"

దీని బట్టి మనోనిబ్బరం ఉన్నవాడు, కష్టపడే తత్త్వం ఉన్నవాడు మాత్రమే విజయం సాధించగలడని అర్థమగుతున్నది.

చూసారా! ఒక యుగం క్రితమే శ్రీకృష్ణభగవానుడు 'శ్రమ' యొక్క గొప్పతనాన్ని తన మాటల్లో విశదీకరించాడు. అదే నేటికీ ప్రామాణికమై ఉన్నది. మనిషి సాధించే ప్రతీ విజయానికి ముఖ్య సాధనం 'శ్రమ'. కష్టపడే తత్వం ఉన్నవారు విజయం సాధించడం తథ్యం! అందుకే

"వృధా కాదు నీ శ్రమ, అదృష్టం ఓ భ్రమ
వ్యధాభరిత జీవితాన్ని వెనక్కి నెట్టి నేస్తమా
ఎదలోన దమ్ము ఉంటే ఎదురులేదు మిత్రమా!
మదిలోన చిన్న ఆశ మహావృక్షమౌనట్టు
కదన రంగాన కదులు ఓ నేస్తమా!" 6

అనే ఈ కవిత అక్షరసత్యం.

మనిషికి తన మీద, తన శ్రమ మీద నమ్మకం ఉన్నంతసేపు భగవంతుని సహాకారం ఉంటూనే ఉంటుంది. శ్రమజీవులకు సౌభాగ్యం తప్పక సిద్ధిస్తుందనే నమ్మకంతో మహాకవి శ్రీశ్రీ గారు వ్రాసిన

"కమ్మరి కొలిమీ, కుమ్మరి చక్రం
జాలరి పగ్గం, సాలెల మగ్గం
శరీర కష్టం స్ఫురింపచేసే
గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి" 7

అంటూ సాగే ఓ గేయం అందుకనే యావత్ప్రపంచాన్ని ఉర్రూతలూగించింది. శ్రమ యొక్క గొప్పతనాన్ని చాటి చెప్పగలిగింది.

కనుక మిత్రులారా! అపజయానికి సొమ్మసిల్లవద్దు. నీరసపడవద్దు. అత్యంత శక్తిమయ కుళికలు, ఒక కోటి జలపాతాల పాటలు, శతకోటి సముద్ర తరంగాల మోతలు మా ఈ మాటలు! మనసారా ఆరగించండి. ఉత్తేజభరితులై నిత్యజీవనపు పరుగుపందెంలో పాల్గొనండి. వేగ నిరోధకాలు, ప్రతిబంధకాలు సర్వసామాన్యం! వాటిని చూసి ఎక్కడా ఆగి పోవద్దు. ముళ్ళదారిలో పయనిస్తున్నామనుకోవద్దు. మీరు చూసారో లేదో, ఆ ముళ్ళకి ఆమడ దూరంలో పూలున్నాయి. శక్తివంచన లేకుండా పరుగెత్తండి, గమ్యాన్ని చేరుకోండి.

"మరో ప్రపంచం, మరో ప్రపంచం, మరో ప్రపంచం పిలిచింది!
పదండి ముందుకు, పదండి త్రోసుకు, పోదాం, పోదాం పైపైకి!
కదం తొక్కుతూ, పదం పాడుతూ,
హృదంతరాళం గర్జిస్తూ, పదండి పోదాం పైపైకి!" 8

జ్ఞానమే శక్తి! జ్ఞానమయమైన ప్రతీ మనస్సు సూర్యతేజస్సుకు సమానం! రాత్రి సమయాలలోనూ, ఆకాశం మేఘావృతమైనప్పుడు సూర్యకిరణాలు మనలని తాకలేకపోవచ్చు. కానీ, వాస్తవానికి సూర్యుడు నిత్యం ప్రకాశిస్తూనే ఉంటాడు. అలాగే కష్టసమయాలలో మానవ ప్రతిభ గుర్తింపబడదు.

అలాగని కష్టసిద్ధాంతంపై నమ్మకాన్ని వదులుకోవద్దు. మీ కష్టాన్ని నమ్మండి. ఆశ మిమ్మల్ని గాఢాంధకారంలో నుండి వెలుగుల పగలుకు తీసుకు వస్తుంది. అప్పుడే కనపడుతుంది సూర్యతేజస్సు! అప్పుడే తెలుస్తుంది ప్రపంచానికి మీ గొప్పతనం ఏమిటో!

మిత్రులారా! మీరు ధీరులు.

"ధీరుల్ విఘ్ననిహన్యమానులగుచున్ ధృత్యున్నతోత్సాహులై
ప్రారబ్ధార్థములుజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధుల్ గావునన్!" 9

కనుక ధైర్య పద్ధతిననుసరించండి. కదన రంగమున కాలుదువ్వండి. ఆయుధాలని బయటికి తియ్యండి. అంతర్గత శత్రువులను పారద్రోలండి. విజేతలై విజృంభించండి.

అత్యంత ముఖ్యమయిన ఈ సమయంలో మానసిక స్థైర్యాన్ని కోల్పోకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షకు హాజరవ్వండి. విజయమాధుర్యాన్ని ఆస్వాదించండి. మీ తల్లిదండ్రులకు మీ పైన ఉన్న నమ్మకాన్ని నిలబెట్టండి. వారి ఆశలు వమ్ము కానీయకండి. మీ కృషికి భగవదనుగ్రహం ఎల్లప్పుడు తోడుగా ఉంటుంది.

మీ విజయమే మా విజయం!

సదా మీ విజయాన్నే కాంక్షించే శ్రేయోభిలాషులు...

వక్కలంక కృష్ణచైతన్య శ్రీరాములు అప్పన
ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం
వెలగపూడి రామకృష్ణ సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజి, విజయవాడ

*1,7,8: మహాకవి శ్రీశ్రీ*
*2,3 : శ్రీరాములు అప్పన*
*4 : యాన్సి*
*5 : వేదవ్యాస మహర్షి*
*6 : రత్నశ్రీ*
*9 : ఏనుగు లక్ష్మణకవి*

మా ఆలోచనలు కార్యరూపం దాల్చడానికి తన సంపూర్ణ సహాయ సహకారాలను అందించిన ప్రియమిత్రుడు సత్య రమేష్ కి మా హృదయ పూర్వక కృతజ్ఞతలు.